

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర




సంపుటి : 9 సంచిక : 15 పుష్పం : 31-32 20-4-2004

RAMANA BHASKARA
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 15

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : Rs. 150/-
Each Copy : Rs. 8/-

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188


## "ధర్మాన్ని ఆచరిస్తే - ఆ ధర్మమే మనలను రక్షిస్తుంది"

ధర్మానికి ప్రతిరూపము శ్రీరాముని అవతారం. ఆయన నడిచిన బాటలో పయనిస్తే సత్యాన్ని దర్శిస్తాము. ధర్మం ఒక పరిపూర్ణమైన విజ్ఞానశాస్త్రం. మనస్సుకు, శరీరానికీ గల సంబంధాన్ని తెలిపేఉత్తమశాస్త్రం. ప్రతీక్షణం మనం అనేకచర్యలకు, ప్రతిచర్యలకు గురిఔతూఉంటాము. ఉదాహరణకు నన్ను ఎవరైనా తిట్టారు అనుకొందాము నాస్పందన ఎలాఉంది అనే అభ్యాసంనాకు లేకపోతే వెంటనే నేను ఉద్రేకానికి గురిఔతాను అలా ఎందుకు అవ్వాలి ఈశ్వర ఆజ్ఞ ప్రకారం అలాజరిగింది అని సమాధానపడాలి. అతను నిరంతరం అసూయతో దుఃఖించే రోగి, అలాంటి వానిపై కోపం తెచ్చుకొని ఆరోగ్యాన్ని నేను ఎందుకు కొనితెచ్చుకోవాలి అనే అవగాహన అనుభవపూర్వకంగా రావాలి. అధర్మంతోనిండిన ఈ ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నం చెయ్యకుండా ప్రతిస్పందనలేకుండా ఉంటే దుఃఖానికి గురికాము. మనలను నిందిస్తే అది వాళ్ళ సమస్య దాన్ని మనసమస్యగా చేసుకొని దుఃఖిస్తే మనం-మనవశంలో లేకుండా వానికి బానిసలవుతాము. ఇక అప్పడు మనలను ఎప్పడు బడితే అప్పడు తిట్టె అవకాశంమనవే వారికి యిచ్చినవారమౌతాము. ఆ అవకాశం మనం ఎందుకు యివ్వాలి. ధన-మాన, సంరక్షణలో మనం బుస్ మనాలి కాని కరవకూడదు. అలాలేకపోతే ప్రపంచంలో మనం బ్రతకలేము. భుక్తికోసం, సంపదను రక్షించుకోవటంలో ఉదాసీనత పనికిరాదు. ధర్మాచరణలో ప్రధాన ప్రతిబందకం కోరిక, ధర్మపరమైన కోరిక తప్పలేదు. మనం ఒక అధర్మమైన క్రియను కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటే జీవితంపాడుగునా దాన్ని సంరక్షించుకొనే భారానికి గురియై భయపడుతూ ఉంటాము. "ధర్మం శరణం గచ్ఛామి" అన్నారు బుద్ధుడు. ధర్మాచరణకు సత్యవాక్ పరిపాలన పునాది, స్వార్ధాన్ని అదిగమించి వైరాగ్యం ఉన్నవారే అందుల్లో నిలబడతారు. "నీవు ఒక పని ధర్మమని హృదయపూర్వకంగా నిర్ణయించుకొంటే, నీ పనిని ప్రపంచమంతా వ్యతిరేకించినా, ధర్మజీవనం నుంచి వెనుకడుగు వెయ్యకు" అన్నారు గాంధీ, ధర్మాచరణలో కష్టాలను ఎదుర్కోటానికి సహనమనే సంపదను పెట్టుబడిగా పెట్టాలి. ఇందులో మనం ఎన్ని చిత్రహింసలకు గురిఔతున్నా సహనాన్ని కవచంగా చేసుకొంటే చిరునవ్వుతో ముందుకు సాగగలం. ప్రపంచాన్ని రక్షించే ధర్మాన్ని ధర్మరాజు ఆచరించి చివరకు కృతార్ధుడైనారు. "ధర్మం జయిస్తుంది-అధర్మం నశిస్తుంది" ఈ విశ్వాసమే మనకు నిజమైన సంపద-దానితో శాశ్వత సుఖస్వరూపాన్ని పొందుదాము.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్ధవరం

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


18-02-2004 చించినాడ శివరాత్రి ....... 3
29-02-2004 జిన్నూరు....... 9





Visit us @ www.srinannagaru.com

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-2-04, చించినాడ శివరాత్రి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈశ్వరుడికి ఒకపని ఉంది. దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి ఆదేహాలను నియమిస్తూ ఉంటాడు. మనకు బ్రహ్మమే లోకం క్రింద కనిపిస్తోంది. మహాజ్ఞానికి లోకంకూడా బ్రహ్మంగానే కనబడుతుంది అంటే వాడికి ఈ ప్రపంచం కూడా బ్రహ్మమే ఎందుచేతనంటే వాడికి బ్రహ్మంకంటే వేరుగా ఏమీలేదు. మనకుతాడు పాముకింద కనిపిస్తోంది అనుకోండి. అప్పడు శివుడు చెపుతాడు అలాకంగారు పడకండి, అదిపాముకాదు, అదితాడే అనిచెపుతూ మనకు జ్ఞానాన్ని బోధిస్తాడు. అంటే ఆయనకు లోకానికి సంబంధించిన పని ఉంది. మామూలువాళ్ళు అయితే మిమ్మల్ని ఏదో ఉద్దరిస్తున్నాము అని అనుకొంటారు, జ్ఞానికి అసలు ఉద్దరించటానికి తను తప్పించి ఏమీ కనబడదు. జ్ఞాని నేనుగా ఉండడు, తానుగా ఉంటాడు, అంటే బ్రహ్మంగా ఉంటాడు. అందరిలోను చైతన్యాన్నే చూస్తాడు. తప్ప ఒప్పలు మనస్సులో ఉన్నాయి. జ్ఞానికి తప్పలేదు, ఒప్పలేదు, అసలు బ్రహ్మం తప్పించి ఏమీ కనబడదు. వారు మంచివారని, వీరు చెడ్డవారని, వారు గొప్పవారని వీరు తక్కువవారని, వారు పుట్టారని వీరు చనిపోయారు అని ఇలా అసలు అనుకోవటాలే మాకులేదు, అనుకొంటేకదా ఏమైనా ఉండటం, అనుకోకపోతే ఏమీలేదు అంటున్నారు భగవాన్. ఇంకో మనిషిని అజ్ఞానిగా చూస్తూ ఉంటే వాడు జ్ఞానికాదు అంటే బ్రహ్మంకు భిన్నంగా వాడికి ఏదో కనిపిస్తోంది, అంటే అక్కడ ఏదో కొరత ఉంది, ఏదో వెలితి ఉంది, యింకా పొందవలసింది ఏదో ఉంది, అంటే వాడి పని ఇంకా పూర్తి అవ్వలేదు. ఈ రోజు శివరాత్రి. ఈ రోజున మనం ఏమి చెయ్యాలి అంటే శివుడిని స్మరించుకొంటూ, లింగాన్ని అర్చనచేస్తూ, ఆరూపాన్ని ధ్యానించుకొంటూ ఆయన దయకు, ఆయన కృపకు పాత్రులం అవ్వాలి. ఆయన దయకు పాత్రులమయితే మనం పొందింది ఏదో పర్మనెంట్‌గా ఉంటుంది. కర్మఫలం నశిస్తుంది కాని దేవునికృప నశించదు. మీరు ఏదో యజ్ఞాలు చేసి, యాగాలు చేసి గొప్పగొప్ప పుణ్యాలను సంపాదించుకొన్నారు అనుకోండి, కొంతకాలానికి మీరు అనుభవించాక అది నశిస్తుంది. కర్మఫలం ఎంత గొప్పది అయినా నశిస్తుంది కాని దేవునికృప నశించేది కాదు, అది నశించదు. ఈరోజున మనం శివస్మరణ, శివధ్యానం ఎలా చేయాలి అంటే ఒక చెంబులో ఉన్న నెయ్యి ఇంకో చెంబులో పోస్తూఉంటే ధారగా ఎలా పడుతుందో అలాగ అన్యచింతనలేకుండా, విషయచింతన లేకుండా తైలధారవలె ఈరోజున మనం శివస్మరణ చేయాలి.

మనదేశం బాగుపడాలంటే, మనం బాగుపడాలంటే పనిదగ్గర బద్ధకం ఉండకూడదు, పనియందు గౌరవం, సిన్సియారిటీ ఉండాలి. మన నాయకులు పని గురించి



చెప్పరు, సిన్సియారిటీ గురించి చెప్పరు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నువ్వు ఏదో కష్టం అనుకొంటున్నావు, ఆ అనుకోవటాలు మానివెయ్యి. ముందు సబ్జక్టు మీరు అర్ధం చేసుకోండి. ప్రారబ్దం లేకుండా దేహంరాదు. అది మంచి ప్రారబ్దం అవ్వవచ్చు చెడు ప్రారబ్దం అవ్వవచ్చు. నువ్వు అనుభవించే ప్రారబ్దం లేకపోతే అసలు దేహమేరాదు. ప్రారబ్దాన్ని నీవు ఆపుచేయలేవు నీ దేహప్రారబ్దంలో స్తోత్రం ఉంటే స్తోత్రం వస్తుంది, విమర్శలు ఉంటే విమర్శలు వస్తాయి, ఏది ఉంటే అది వస్తుంది. దేహప్రారబ్దాన్ని నీవు తప్పించలేవు . కాని ఆదేహము నీవు కాదు, నువ్వు దేహంతో తాదాప్యం వదిలేస్తే ఆదేహం ప్రారబ్దాన్ని అనుభవిస్తుంది, నీకు సుఖంగా శాంతిగా రోజులు వెళ్ళిపోతాయి, ప్రారబ్దాన్ని నీవు ఆపుచేయలేవు సాధనచేసి దానితో తాదాప్యం వదిలేయగలవు. అది శివస్మరణవలన సాధ్యమే. ఆదేహన్ని ప్రారబ్దం అనుభవించనియ్యి, ఆదేహంతో నీకు తాదాప్యం లేనప్పడు ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అనే స్పృహకూడా నీకు ఉండదు, ప్రారబ్దం అనుభవించటం అయిపోతుంది, నీకు అశాంతిరాదు. నీ ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తుంది, లేని దానిని నీవు ఆశించినా రాదు. ఉన్నది నీవు కోరుకోకపోయినా వస్తుంది. ఆ విషయం ప్రారబ్దానికి వదిలెయ్యి. నీవు చిత్తశుద్ధిని అలవర్చుకో. చిత్తశుద్ది కలిగినప్పడు లోపలఉన్న ఆనందం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. శివుడిని స్మరించి, శివుడిని ధ్యానించి, ఆనామాన్ని నీ హృదయంలో నిలుపుకొని శరీరం మరణించక ముందే మరణంలేనిస్థితిని పొందు, అది శివరాత్రి సందేశం.

ఆశ అనేది పాశం లాంటిది. చేతికి తాడు కట్టి లాగుకొనిపోతున్నట్లు ఆశ మనస్సును అలా లాగుకొని పోతుంది. ఈ ఆశ అనేతాడును మనం తెంపుకోలేము. ఆశ అనే పాశాన్ని తెంపగలిగినవాడు, ఆశ నుండి నిన్ను విడుదల చేయగలిగినవాడు శివుడు ఒక్కడే. శివుడి దగ్గర వైభవం ఏమిటి అంటే ఆయనకు ఏమి అక్కరలేదు, మనకు మాత్రం అన్నీ ఇస్తాడు వాడు శివుడు. మేము ప్రయత్నం చేస్తున్నాము, ఆత్మజ్ఞానం కలగటం లేదు అని అడిగితే మీరు సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తున్నారా? మీప్రయత్నంలో చిత్తశుద్ధి ఉందా? తప్పనిసరిగా పొందాలి అని హృదయపూర్వకంగా మీరు ప్రయత్నం చేస్తున్నారా? హృదయపూర్వకంగా, నిండుమనస్సుతో దానిని పొందాలి అనే ప్రయత్నం చేయకుండా దానిని ఎలా పొందుతారు. మనం భగవంతుడిని మోసం చేయలేము. ఆయనకు తెలియకుండా ఈ సృష్టిలో ఏమీ జరగటానికి వీలులేదు. మనకు యోగ్యత ఉన్నప్పడు, రాగద్వేషరహితస్థితిని పొందినప్పడు శివుడే మన దగ్గరకు వచ్చి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. మనదగ్గర శక్తి ఉంటే ఆమాటలకు విలువ ఉంటుంది. నీవు పరిమితులు లేనివాడవు కాని నాకు పరిమితులు ఉన్నాయి అని నీవు కల్పించుకొంటున్నావు, ఏదో ఊహించుకొంటున్నావు. శివుని దయకు

పాత్రుడివి అవ్వాలంటే నీవు రాగద్వేషరహితస్థితిని పొందు. హృదయంలో మృదుత్వం ఉండాలి. మీరు ఎవరికైనా ఏదైనా ఇస్తే అది బాగుంటేనే ఇవ్వండి లేకపోతే ఇవ్వవద్దు. కొంతమంది ఇంట్లో నాలుగు మామిడిపండ్లు ఉన్నాయి అనుకోండి, ఎవరికైనా ఇచ్చేటప్పుడు ఏపండు బాగాలేదని చూస్తారు, బాగాఉన్న పండ్లు ఉంచేసుకొంటారు, బాగాలేనిది, ఇతరులకు ఇస్తారు. మీకు ఏదిమంచిదో అదే ఇతరులకు మంచిది అన్నసంగతి తెలియని నీకు మోక్షమా? నీకు ఆత్మజ్ఞానమా? 24 గంటలు మలినమనస్సు జ్ఞాపకం వస్తూఉంటే ఇంక ఇతరులను ఎలా ప్రేమించగలవు, ప్రేమించటం సాధ్యంకాదు.

నీవు పూజ చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి కాని చిత్తశుద్ధితో చెయ్యి, శివుని దయలేకపోతే చిత్తశుద్ధిరాదు, చిత్తశుద్ధి లేకుండా శివుని పూజిస్తే ఆయన దయరాదు. ఈ రెండు సంపాదించటానికి మనం ప్రయత్నం చేయాలి. ఏది ముందు, ఏది వెనుక అంటే మనం చెప్పలేము, సమానంగా చేసుకొంటూ వెళ్ళిపోవటమే. ఆ గొడవలు, ఈ గొడవలు అని గొడవలను కల్పించుకొనేవాడివి నువ్వే, మరల ఆ గొడవలనుండి బయటపడాలి అని ప్రయత్నం చేసేవాడివి నువ్వే. అక్కడకుపంపు, ఇక్కడకు పంపు అని శివుడిని అడగవద్దు. నువ్వు ఎక్కడ ఉంటే అక్కడే స్వర్గంగా చెయ్యమని అడుగు, వైకుంఠంగా చెయ్యమని అడుగు, కోటీశ్వరుడు కూటి కోసం తిరగడు, ఆత్మానందం పొందినవాడు విషయాలకోసం తిరగడు, రోజూ వచ్చి మనలను ఎవడు పొగుడుతాడు అనిచూడడు, అంటే వాడికి కూడా ఉండి గాలికొట్టేవారు అవసరంలేదు. వాడికి ఆతలంపు రాదు, వీడికి ఈతలంపు రాదు. అసలు నీకు దుఃఖమేలేదు, నీ స్వరూపం సత్యం ఆనందం, కల్పితంలో దుఃఖం ఉంది కాని సత్యంలో దుఃఖంలేదు. ఎక్కడయితే సత్యం ఉందో అక్కడ జ్ఞానం ఉంటుంది, ఎక్కడ జ్ఞానం ఉందో అక్కడ ఆనందం ఉంటుంది. శివుని కృప ఉంటే పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ఆనందంలో ఉన్నట్లు, క్షేమంగా ఉన్నట్లు నీకు అనిపిస్తుంది, అది శివుని దయ. నీవు అంతరదృష్టిని అలవర్చుకో అప్పుడు బయటవిషయాలనుండి సంతోషం పొందాలి అనే బుద్ధి నీకు ఉండదు. నీవు కష్టపడి బయటవిషయాల నుండి సంతోషం పొందినా అది నిలబడదు, ఎలా వచ్చిందో అలాగేపోతుంది. మనకు సంతోషం వచ్చినప్పుడు ఎంత బాగుంది అని అనుకొంటాము, అలా అనుకొన్నప్పుడు లోపల మనస్సులో ముద్రపడిపోతుంది, ఆముద్రలు పునర్జన్మకు కారణం అవుతాయి. మీకు ఏకారణం వలన ఆసంతోషం వచ్చిందో మరల ఆకారణం కోసం వెతుకుతారు కాని మీ మనస్సు శివుడివైపుకు తిరగదు, ఇదో ప్రమాదం. ఇప్పుడు మనకు జననానికి, మరణానికి ఉన్న బేధం తెలుస్తోంది, ఆభేదం తెలియనిస్థితికి మనం వెళ్ళాలి. మనకు ఎన్ని ఉన్నా రాగద్వేషరహితస్థితిని పొందేవరకు భగవంతుడు ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వడు. మనం ఎలా ప్రవర్తిస్తే, మన జీవితయాత్ర ఎలా ఉంటే ఈశ్వరుని దయకు పాత్రులమవుతామో ఆరకంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి, అదే సాధన.

జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు, వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకో, వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొంటే భవిష్యత్ కాలం మనకు అనుకూలంగా ఉంటుంది. పరిస్థితులు మనకు అనుకూలం అవుతాయి. ఇతరులను కాదు నీవు తిరస్కరించవలసింది, నీలోఉన్న అజ్ఞానాన్ని తిరస్కరించు, దానిని ఈసడించుకో. ఎందుకు పనికిరానిది నీలోఉన్న అజ్ఞానం. అందులో నుండి విడుదలపొందు. అప్పుడు నీవు పొందవలసింది ఏదో పొందుతావు. దాని గురించి ఊహించవద్దు. లోపలఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఈసృష్టి అంతా గడ్డిపరకలాగ నీకు కనిపిస్తుంది. ఎవరైనా ఆత్మస్తుతి చేసుకొంటున్నారు అనుకోండి లేకపోతే పరనింద చేస్తున్నారు అనుకోండి మీరు అక్కడ ఉండవద్దు, ఏదో ఒక అబద్దం చెప్పిఅయినా అక్కడనుండి బయటకు వచ్చేయాలి. నీకు ఉన్న కష్టం నిజమయితే, నీ బాధలు నిజమయితే, నీ చేత చూడబడుతున్న ఈ ప్రపంచం నిజమయితే, నీ బంధువులు, శత్రువులు నిజమయితే ఇవిఅన్నీ నిద్రలో ఎక్కడికి వెళ్ళినాయి. ఇదంతా మనోకల్పితమే, ఈ ప్రపంచం కూడా మనోకల్పితమే. మనస్సు ఉంటే ఇవిఅన్నీ ఉన్నాయి. గాఢనిద్రలో మనస్సులేదు అందుచేత అది కల్పించే విషయాలు అక్కడలేవు. గాఢనిద్రలో ఇవిఅన్నీ లేనప్పుడు కూడా నీవు ఉన్నావు. ఆనిద్రలో ఉన్నవాడు జాగ్రదవస్థలో కూడా ఉన్నాడు, వాడిని పట్టుకో, అదే సాధన, నీవు అనుభవించే కష్టాలు, సుఖాలు కూడా మనోకల్పితమే, ఇదంతా మనస్సు యొక్క గోల. మనస్సు ఉంటే అంతా ఉంది, అదిలేకపోతే ఏదీలేదు. అందుచేత సాధన యొక్క లక్ష్యం మనోనాశనమే. ఉండే వారు ఆత్మ, అనుకొనేవారు జీవుడు. వీరు అనుకోవటం మానివేస్తే వీరు వారు అవుతారు. అదే అద్వైతానుభవం, అక్కడికి చేరేవరకు ప్రతీజీవుడికి వేదన తప్పదు. 24 గంటలు నీకూడా ఉండే వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొంటే ఉన్నదే ఆనందం. దానిని వదిలేసి ఎక్కడో ఆనందం ఉంది అని వెతుక్కొంటున్నావు. ఆత్మానందంకంటే మించిన భాగ్యం ఉందా? ఇది తరగని భాగ్యం.

నాకు పరిమితులు ఉన్నాయి, పరిమితులు ఉన్నాయి అని గోలపెడుతున్నావు, చిరాకు పడుతున్నావు. మరి ఈ పరిమితులు అన్నీ గాఢనిద్రలో ఎక్కిడికి వెళ్ళినాయి. గాఢనిద్రలో నీవులేవా? ఇవన్నీ నువ్వు అయితే గాఢనిద్రలో ఇవి నిన్ను ఎందుకు విడిచిపెట్టేస్తున్నాయి. ఇదంతా మనస్సు యొక్క కల్పితమే. ఈ గొడవలలోనికి వెళ్ళవద్దు. నీవు ఈ లోకంలోనికి వచ్చావు, వచ్చిన పని చూసుకో. ఇప్పుడు నీకు ఉన్న అవకాశములను ఉపయోగించుకొని ఈ లోకంలోనికి తిరిగిరాకుండా ఉండే స్థితిని సంపాదించుకో. ఇప్పుడు మనం ఉన్నాము,

కొంతకాలం తరువాత మనం ఉండము అనుకొంటున్నాము. అంతటావ్యాపించిఉన్న వస్తువుకు కాలం ఎక్కడ ఉంది, దేశం ఎక్కడ ఉంది, చావు ఎక్కడ ఉంది, పుట్టుక ఎక్కడ ఉంది, ప్రయాణాలు ఎక్కడ ఉన్నాయి. ఫలానా టైములో నేను ఉన్నాను, ఫలానాటైములోనేను లేను, ఫలానా చోట నేను ఉన్నాను, ఫలానా చోట నేనులేను అని అనుకొనేదంతా మనోకల్పితము. అసలుసత్యానికి నీవు అనుకొనే విషయాలకు ఏమీ సంబంధంలేదు. నీవు కాలానికి బంధింపబడి ఉన్నంతకాలం, కోరికకు బంధింపబడి ఉన్నంతకాలం నీకు శివస్వరూపం ఎలా తెలుస్తుంది. నీ హృదయంలో గొప్పఆనందాన్ని పెట్టుకొని, గొప్పశాంతిని పెట్టుకొని దానిని మర్చిపోయి ఏడవటం నేర్చుకొన్నావు. మీ గదిలో అడుగున చాలా బంగారం ఉంది అనుకోండి, ఆ బంగారం అక్కడ ఉంది అని తెలియనప్పుడు మీరు ఏమనుకొంటారు, మేము పేదవారము అనుకొంటారు. అలాగే మీ హృదయంలో ఉన్న ఆనందం మీకు తెలియనప్పుడు మీరు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు. మన పరిస్థితి ఎలా ఉందో ఇక్కడ భగవాన్ చెపుతున్నారు. ఎదురుగా తినటానికి రకరకాల పదార్థములు ఉంటే తినటం మానేసి నాకు ఆకలిగా ఉంది, నాకు ఆకలిగా ఉంది అని అనుకోవటం ఎలాగఉంటుందో, నీ హృదయంలో హద్దులులేని ఆనందం పెట్టుకొని దానిని అందుకోవటం మానివేసి నీవు ఏడుస్తూ కూర్చోవటం కూడా అలాగే ఉంది అంటున్నారు. మీకు కోట్ల డబ్బు ఉంది అనుకోండి, గొప్ప గౌరవాలు ఉన్నాయి అనుకోండి, బాహ్యంగా దేనికి మీకు లోటు లేదు అనుకోండి కాని మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, ఇవన్నీ ఏమి చేసుకొంటారు, వాటివలన ప్రయోజనం ఏమిటి? డబ్బుపెట్టి మందులు కొనుక్కోగలం గాని డబ్బుపెట్టి ఆరోగ్యం కొనలేము డబ్బుపెట్టి  ఆరోగ్యమే కొనలేనివాడివి మోక్షాన్ని ఎలా కొనగలవు. మీ ఇంట్లో ఎన్ని ఉన్నా మీకు అవగాహన లేనప్పుడు మీకు శాంతిరాదు.

మీరు ఏదో చెపుతున్నారు. మాకు ఉండే కష్టాలు మాకు ఉన్నాయి, మాకు ఉండే బాధలు ఏవో మాకు ఉన్నాయి అని అంటే దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీకు ఉండే కష్టాలు, నీకు ఉండే ఇబ్బందులు ఈశ్వరకల్పితంకాదు, అవి నీ మనస్సు కల్పించినవే. ఫలానాదేహంనాది, ఫలానా పేరునాది అని నీవుకాని దేహంతో నీవుకాని పేరుతో తాదాప్యం పొందుతూ ఉన్నంతకాలం నిన్ను దుఃఖం వెంటాడుతుంది, వేదన రోధన వెంటాడుతాయి. ఇందులో రాజీపడే సమస్యలేదు అంటున్నారు భగవాన్. మీకు ధనం ఉంటే మీకు ఉన్న భాగ్యంతో భోగాలు కొనగలముగాని ముక్తినికొనలేము, జ్ఞానంతో ముక్తిని కొనుక్కోవచ్చు. నీవు భగవంతుడి చేతిలో పనిముట్టుగా ఉన్నావు అనుకో, ఎవరైనా నిన్ను పొగిడినా, నిన్ను విమర్శించినా నీకు ఏమీ అనిపించదు, అప్పడు నీకు దుఃఖం వచ్చే సమస్యలేదు, అంతా భగవంతుడే చేస్తున్నాడు అని నీకు అనిపిస్తుంది. నువ్వు భగవంతుడి చేతిలో పనిముట్టుగా ఉండటం మానేసి, వ్యక్తిభావనను పెట్టుకొని, ఇదిఅంతా నాతెలివి అనుకొన్నప్పడు మంచికిమంచి, చెడ్డకుచెడ్డ ఎత్తుకు ఎత్తు వడ్డీతోసహా అనుభవించవలసిందే.  నీ స్వరూపమే సుఖం, నీ ఉనికే సుఖం, మీరే ఆనందం, మనిషి ప్రతీపని ఆనందం కోసమే చేస్తాడు. అందులో ఆనందం లేకపోయినా, దానివలన ఆనందం రాకపోయినా ఆనందం వస్తుంది అనుకొని ఆపనులు చేస్తాడు.  అసలు మనిషి యొక్క ఉనికే ఆనందం, కాని ఆనందం ఎక్కడఉందో వాడికి తెలియటంలేదు, ఎక్కడో బయటఉంది అని వెదుకుచున్నాడు, అక్కడలేదు కాబట్టి దొరకదు. ఆనందం ఎక్కడఉందో అక్కడ వెదికితే, అటువైపు మొఖం తిప్పితే ఈజన్మలో కాకపోయినా రాబోయేజన్మలో అయినా అది వాడికి దొరుకుతుంది. సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకోండి.  నీ శరీరం ఆనందంకాదు, నీ మనస్సు ఆనందంకాదు, నీ ఉనికే ఆనందం. దానితాలుక ఎరుకలేకపోవటంవలన ఆనందంకోసం బజారులోపడ్డావు. అందుచేత పెళ్ళిచేసుకొంటే ఆనందం, డబ్బు సంపాదిస్తే ఆనందం, పదవిలోకి వెళితే ఆనందం, అందరూ మెచ్చుకొంటే ఆనందం వస్తుందని అనుకొంటూ ఎక్కడయితే ఆనందం లేదో అక్కడ ఆనందం కోసం వెదుకుచున్నావు. ఇలా ఎన్ని గంటలు వెదికినా, ఎన్ని జన్మలు వెదికినా అది నీకు దొరకదు. ఎక్కడయితే ఆనందం ఉందో అక్కడ వెదుకు, అది నీకు ఎరుకలోనికి వస్తుంది. నీ హృదయంలో ఉన్న ఆనందం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు నీ మనస్సును కదలమంటే కదలదు. లోపలఉన్న ఆనందం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఈ ప్రపంచం అంతా కూడా ఒక నీటి బొట్టు కిందకాదు, ఒక నీటి తుంపర కింద అనిపిస్తుంది, అది ఆత్మయొక్క వైభవం, అది లోపలఉన్న ఆనందం యొక్క వైభవం.

ఏదో రోజున మన శరీరం శవం అవుతుంది. జన్మకో శివరాత్రి అంటే కనీసం మన శరీరం శవం అవ్వకముందే ఒక శివరాత్రి అయినా చేయండి అని చెప్పటం. శివరాత్రి ఎలా చేయాలి అంటే పగలు శివునికి దగ్గరగాఉండాలి, రాత్రి నిద్రపోకుండా శివస్మరణతో గడపాలి, 24 గంటలు అలాగ ఉండాలి. శివరాత్రి రోజున అయినా లోకవిషయాలకు దూరం ఉండి, శివుడిని స్మరించుకొంటూ జీవించండి. మనం పగలు ఏమీ తినకూడదు అని చెప్పి మీ మనస్సు  అన్నం దగ్గర ఉండకూడదు, శివుడు దగ్గర ఉండాలి. ఉపవాసం రోజున మనం అన్నంకు దగ్గరగా ఉంటాము. ఉపవాసం చేసి అన్నంకు దగ్గరగా ఉండటం కాదు, పరమాత్మకు దగ్గరగా ఉండాలి. తీగ గెడకు ఎలా అల్లుకొనిపోతుందో అలాగ మన మనస్సు, ఇంద్రియాలు శివస్మరణతో అల్లుకొనిపోవాలి. మనం రోజూ ఇంద్రియాలతో, మనస్సుతో విషయాలను అంటిపెట్టుకొని ఉంటున్నాము, విషయాలను కౌగిలించుకొంటున్నాము. కనీసం

శివరాత్రి రోజున అయినా మనస్సుతో, ఇంద్రియాలతో శివుడిని కౌగిలించుకోండి, శివుడిని చుట్టుకొని ఉండండి. అలా శివుడిని చుట్టుకొని ఉంటే ప్రారబ్ధం కొట్టే దెబ్బలు ఏవైనా ఉంటే అవి మీకు తగలవు, ఆయనకు తగులుతాయి, మీరు ఈరకంగా జీవిస్తూ ఉంటే ఆయన దయకు పాత్రులవుతారు,, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. ప్రారబ్ధం దేహానికే, దేహంతో తాదాప్యం లేకపోతే ప్రారబ్ధం నిన్ను ఏమీ చేయలేదు, నీ దగ్గర ప్రారబ్ధమే ఓడిపోతుంది. కనీసం ఈ శివరాత్రి రోజున అయినా మీ డబ్బు గొడవ, యశస్సుగొడవ, కుటుంబం గొడవ వదులుకొని, ఈ పిచ్చిగొడవలకు దూరంగా ఉండమని, శివుడిని స్మరించుకోమని పెద్దలు చెపుతున్నారు. శివుడిని స్మరించగా, స్మరించగా జీవుడు బంధంలోనుండి విడిపోతాడు ఎవడి మనస్సులో అయితే మినహాయింపులులేని ప్రేమ శివుడివైపు ప్రవహిస్తోందో వాడు శివానుగ్రహం వలన ముక్తిని పొందుతాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-2-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవదనుభవం పొందటానికి మనం ఒకే మార్గంలో ప్రయాణం చెయ్యాలని ఏమీలేదు. భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం ఇలా అనేక మార్గాలను భగవంతుడు చెప్పాడు. అన్ని మార్గాలు మంచివే, అన్ని మార్గాలను సమన్వయం చేసుకొని పొందవలసిన వస్తువునుపొందాలి. అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుగులోనికి వెళ్ళమని, శరీరానికి మరణం రాకముందే అమృతానుభవం పొందమని ఉపనిషత్‌లలో చెప్పారు. బ్రహ్మం అంటే జ్ఞానం, సత్యం, అనంతం, ఆనందం అని ఉపనిషత్‌లలో చెప్పారు. ఆనందం అంటే అది అలౌకికఆనందం కాదు, ఏదో కారణాలవలన వచ్చే ఆనందంకాదు, ఏదో రోజు చనిపోయే శరీరంతో ఉన్న తాదాప్యంలో వందోవంతు మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాప్యం మనకు లేదు ఇది దురదృష్టకరం. ఈ చనిపోయే శరీరం మీద మనకు ఉన్న ఇష్టం, దీని కోసం మనం పడే ప్రాకులాటలోకొంతైనా లోపలఉన్న సద్వస్తువుతో తాదాప్యం పొందటానికి మనం ప్రయత్నం చేయటంలేదు దీనికి కారణం మనకు పూర్వపుణ్యంలేదు, ఈశ్వరుని పాదాలయందు భక్తిలేదు. మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాప్యం పొందటానికే ఈ జ్ఞానయజ్ఞాలు. మనం చిల్లర విషయాల దగ్గరే ఆగిపోతున్నాము. ఈపూజచేస్తే పుణ్యం వస్తుంది, ఈయజ్ఞం చేస్తే స్వర్గలోకానికి వెళతాము అని పుస్తకాలలో చెపుతున్నారు. ఇక్కడే మనం ఆగిపోతున్నాము. ఇవన్నీ తాత్కాలికవిషయాలు. వీటిలోనుండి నీబుద్ధిని తప్పించాలి. గుణాలు నిన్ను పీడుస్తున్నాయి,



గుణాల నుండి బయటకువచ్చి గుణరహితుడవు ఎప్పుడు అవుతావు. మాయ అంతా తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఈ మూడు గుణాలలో ఉంది. ఈ గుణాల నుండి విడుదల పొందకపోతే నీవు మృత్యువును దాటి అమృతత్వంను పొందలేవు. మనం ఎవరిమీద అసూయ పెట్టుకోకూడదు. అసూయ పెట్టుకొంటే మనకు ఆరోగ్యంరాదు, అనారోగ్యం వస్తుంది, దారిద్ర్యం వస్తుంది. భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు. అందుచేత ఎవరిమీద అసూయ పెట్టుకోవలసిన పనిలేదు.

దైనందినజీవితంలో మనప్రవర్తన ప్రేమగా, శాంతిగా ఉండాలి అంతేగాని అశాంతిగా ఉండకూడదు. ఏది నిత్యం ఏది అనిత్యం, మనం ఎలా ప్రవర్తిస్తే మరణానంతరం వెలుగులోనికి వెళతాము దాని తాలూక వివేకాన్ని పెంచుకోవటమే జ్ఞానయోగం. ఎవరిని మనం అనుసరించకూడదు. భగవంతుడిమాటను ప్రయాణంగా తీసుకోవాలి. ఎవడైతే భగవంతుడి మాటను ప్రమాణంగా తీసుకొని జీవిస్తున్నాడో వాడు గుణరహితుడు అవుతాడు, జీవితానికి మరణానికి భేధంలేనిస్థితికి ఎదిగివెళ్ళిపోతాడు. ఈశ్వరుని దయ ఉంటే మన బుద్ధిలో ఉన్న వంకరలు అన్నీపోతాయి. భగవంతుడి పట్ల గౌరవం కలిగిఉండటం, భగవంతుని పాదాలను ఆశ్రయించటం భక్తియోగం. భక్తుడికిరాయి శివుడిగా కనిపిస్తుంది. భక్తిలేనివాడికి శివుడు రాయిగా కనిపిస్తాడు, అది చూసే దృక్పథంబట్టి ఉంటుంది. భగవంతుడు చెప్పిన మాటను హృదయపూర్వకంగా స్వీకరించాలి, ఇష్టాయిష్టాలు తగ్గించుకోవాలి. ఫలాపేక్ష లేకుండా నీవుపనిచెయ్యి, వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదోరాదు, కర్మయోగం అంటే కర్మను యోగంగా చెయ్యి. నువ్వు చేసే కర్మఎలాగ ఉండాలంటే, అది నీకు లోచూపును కలుగజేయాలి, నీ బుద్ధిశుద్ధి అవ్వాలి. ఇప్పుడు మనం భగవంతుడిలోనే ఉన్నాము. లోపల ఈశ్వరుడు లేకుండా ఈశరీరంరాదు. మీ నామరూపముల మీద మీకు ఎంత ఇష్టం ఉందో అంతఇష్టం లోపలఉన్న ఈశ్వరుడిమీద ఉంటే మీరు మాయలోనుండి బయటకు వచ్చేస్తారు. ఈశ్వరునియందు సజీవమైన విశ్వాసం ఉన్నవాడు ఆయన మాయలోనుండి బయటకు వచ్చేస్తాడు. నీకు వచ్చే ప్రతీతలంపు, నీవు చేసే ప్రతీ పని, నీకు వచ్చే ప్రతీ ఆలోచన నన్ను పొందాలనే లక్ష్యంతో ఉంటే నా మాయలోనుండి బయటకు వచ్చేస్తావు.

జపం చేయటంవలన, ధ్యానం చేయటంవలన అక్కరలేని తలంపులు ఆగిపోతాయి, రాగద్వేషములు తగ్గుతాయి, మన మనస్సు భగవంతుడి వైపు తిప్పబడుతుంది. అసలు వస్తువు పూజలకు, జపాలకు, ధ్యానాలకు, ఈ జననమరణాలకు అతీతం. కాని జపం చేయటంవలన, ధ్యానం చేయటంవలన పూర్వజన్మలో నుండి వచ్చినదోషాలు, నీ బుద్ధిలో ఉన్న వంకరలు అన్నీపోతాయి, బుద్ధికి నిదానం వస్తుంది. ఈజన్మలో నీవు చేసిన పూజలు,

జపాలు, సత్కర్మ మరణానంతరం నీకూడావచ్చి రాబోయేజన్మలో నీకూడా ఉండి నీకు జీవన్ముక్తస్థితిని కలుగజేస్తాయి నీవు ఎవరికైనా సహాయసహకారములు అందిస్తూ ఉంటే ఆమంచిని నీకే ఇచ్చేస్తాను, నాకు ఏమీ అక్కరలేదు, ఆఫలితాన్ని నీకే ఇచ్చేస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. తమోగుణం, రజోగుణం తగ్గించుకొంటూ సత్వగుణాన్ని పెంచుకొంటూ ఉంటే అది మనలో ఉన్న శుద్ధసత్వాన్ని పొందటానికి మనకు సహకరిస్తుంది. ప్రారబ్ధాన్ని బట్టి ఈదేహం వచ్చింది, ఆప్రారబ్ధం అయిన వెంటనే అది మరణిస్తుంది. దేహం జడం, దానిమీదఉన్న ప్రీతి కూడా నీకు నావాక్యం మీదలేదు అని భగవంతుడు అంటున్నాడు. గాఢనిద్రలో మనం ఏదిగా ఉండాలో అదిగా ఉంటున్నాము, అక్కడ ద్వైతంలేదు. నరసాపురం నుండి జిన్నూరు వస్తున్నారు అనుకోండి, పాలకొల్లు వచ్చి ఆగిపోయి అదే జిన్నూరు అని అనుకోకూడదు, మనం పూజలు, జపాలు, ధ్యానాలు చేసుకోవచ్చు కాని మనం పొందవలసింది అద్వైతానుభవం. బాహ్యకారణాలతో సంబంధం లేకుండా, ఇంద్రియాలతో మనస్సుతో సంబంధంలేకుండా స్వతంత్రమైన ఆనందాన్ని మనం పొందాలి, అదే మన గమ్యం, కాని మధ్యలో అదే ఇది అనుకొని ఆగిపోతే మన ప్రయాణం ఆగిపోతుంది. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదంలో పడతాము. చిత్తశుద్ధిలేకుండా, భగవంతుని యందు ప్రేమలేకుండా మాయనేనులో నుండి విడుదల పొందలేము. ఒక చిన్న బీజం పెరిగి పెరిగి మహావృక్షం అవుతుంది. అలాగే ఈ నేను అనే తలంపు ఈ సృష్టికంతటికి బీజం. ఆ బీజాన్ని మాడ్చేయగలిగితే, మాడ్చేసిన విత్తనం భూమిలో పాతిపెట్టినా ఎలా మొలకెత్తదో అలాగే ఈ శరీరంలో ఉండగానే శరీరంతో తాదాప్యం పొందే నేనుఅనేతలంపు అనే బీజాన్ని మాడ్చేయగలిగితే వాడికి పునర్జన్మలేదు.

లోకంలో ఏదో ఉంది అని అనుకొంటున్నాము. లోకంలో ఉన్నది దుఃఖం, అశాంతి. శరీరాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. నీకు శరీరం వచ్చిందంటే ఆశరీరాన్ని, మనస్సును సద్వినియోగం చేసుకొని గెడపను ఎంత తేలికగా దాటతావో అంత తేలికగా మృత్యువును దాటి అమృతత్వాన్ని పొందు అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు పూజచేసుకో, ధ్యానంచేసుకో, నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి కాని గమ్యాన్ని మాత్రం మర్చిపోవద్దు. శరీరం పుట్టింది, ఆత్మపుట్టలేదు. ఏదైతే పుట్టలేదో అది నీవై ఉన్నావు. పుట్టిన శరీరం నీవు కాదు. అది నీవు కానప్పుడు దానితో చూసేదిగాని, వినేది గాని ఏమీలేదు. బాహ్యాఆకర్షణల నుండి నీ మనస్సును మళ్ళించి, దానికి లోచూపును కలుగజెయ్యి. భగవంతుడు నీలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన ఇంద్రియాలకు అతీతుడు, మనస్సుకు అతీతుడు. ఇంద్రియాలకు అతీతమైన వాడిని నీకళ్ళతో ఎలా చూడగలవు. మనస్సుకు అతీతమైన వాడిని నీ మనస్సుతో ఎలా పట్టుకోగలవు. ఒకవేళ నీ మనస్సుతో చూస్తే నీ మనస్సు ఎంత నిజమో, మనస్సుతో చూడబడే వస్తువు కూడా అంతే నిజం. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే ఇప్పడే ఇక్కడే శాంతిలో, ఆనందంలో  ఊగిసలాడతారు, శరీరానికి మరణం వచ్చినా మీకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా అనిపించదు. ఎప్పడూ ఉండేది నువ్వే అనే అమృతానుభవం నీవు పొందినప్పడు శరీరంపోతూఉన్నా ఏదోపోతోంది ఇంక మనం ఉండవేమో అని నీకు అసలు అనిపించనే అనిపించదు. అట్టిస్థితిని ఇప్పడే ఇక్కడే ఈజాగ్రదవస్థలో ఉండగానే నీవు పొందటానికి ప్రయత్నించు. భగవంతుడుచెప్పినమాట ఏదో ఒక కాలానికి పనికి వచ్చేదికాదు, అన్నికాలాలలో, అన్నిఅవస్థలలో పనికివస్తుంది. భగవంతుడు అంతటా ఉన్నాడు. అన్ని కాలాలలో ఉన్నాడు, అన్ని అవస్థలలో ఉన్నాడు, మనకు మెలుకువ వచ్చాక బాగా నిద్ర పట్టింది అని చెపుతున్నాము. అక్కడ నీ మనస్సులేదు, ఇంద్రియాలులేవు. శరీరంలేదు. గాఢనిద్రలో నీనిద్రను ఎవడైతే చూస్తున్నాడో వాడు జాగ్రదవస్థలో కూడా ఉన్నాడు అందుచేతనే రాత్రి బాగా నిద్ర పట్టింది అని చెప్పగలుగుతున్నావు లేకుంటే చెప్పలేవు. శరీరం యొక్క జనన మరణాలు చాలా స్వల్పవిషయాలు, నీ సాధనను నా మీద గురిపెట్టటంలేదు. ఈ పనిచేస్తే ఆపుణ్యం వస్తుంది, ఆపుణ్యం వస్తే స్వర్గలోకానికి వెళ్ళవచ్చు అని ఇలా ఆలోచిస్తూ ఈ గొప్పమానవజన్మను, ఈ అవకాశాన్ని ఇలా చిల్లరవిషయాలకు ఖర్చుపెడుతున్నావు అంటున్నాడు భగవంతుడు. నీవు ఎంత గొప్పలోకాలకు వెళ్ళినా నీమనస్సు ఎంత నిజమో ఆలోకాలు కూడా అంతే నిజం. మనకు దూరదృష్టిలేదు. ఈ పనిచేస్తే ఆపుణ్యం వస్తుంది అనుకొంటున్నావు, మరల అది అనుభవించటానికి శరీరం రావాలి, మరల ఆ శరీరం ఏదో రోజు మరణిస్తుంది. ఇదేనా నీగమ్యం, వీటికోసమేనా నీ ప్రయత్నం, అంతకంటే గమ్యంలేదా నీకు? ఉన్నది బ్రహ్మం ఒక్కటే, నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా దానిని పొందటమే లక్ష్యంగా పెట్టుకో, దానికోసమే జీవించు, దానికోసమే తపించు, దానిని పొందటానికే ప్రయత్నించు, మధ్యలో ఆగిపోవద్దు, ఇతరులను అనుసరించవద్దు, గమ్యాన్ని మర్చిపోవద్దు.

ఓం భోజనాయనమః నీకు ఇష్టమైన పదార్థాలు రుచిగా, శుచిగా, వేడిగా, ఎంతో ప్రేమతో పెట్టినప్పడు ఎంత బాగుంది ఎంత బాగుంది అని ఎంజాయ్ చేస్తూ నెమ్మదిగా తింటూ వాటిని ఎలా అనుభవిస్తామో అలాగ భగవంతుని కళ్యాణగుణాలను, ఆయన అనంతత్వాన్ని ఎంజాయ్ చేస్తూఉంటే, అనుభవిస్తూ ఉంటే ఆయన మనకు గోచరిస్తాడు. మనకు తెలివితేటలు ఉండవచ్చుగాని అతితెలివి పనికిరాదు. మన తెలివి మనకు ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి, భగవదనుభవం పొందటానికి అది నీకు

సహకరించాలి, లేకపోతే ఆ తెలివిని ఏమి చేసుకొంటావు. ఇష్టమైన పదార్థాలు తినేటప్పుడు ఎలా ఉంటున్నావో సాధన చేసేటప్పుడు కూడా అలా ఉండాలి. మనస్సు వెళ్ళి హృదయంలో లయమవ్వాలి. అంతఃకరణశుద్ధిలేకుండా మనస్సు హృదయంలో లయమవ్వదు. హృదయం ఎంత పవిత్రంగా ఉందో అలాగ నీ మనస్సు అంత పవిత్రం అయితే మనస్సు హృదయంలో లయమవుతుంది. కేవలం అన్నం తినటానికి, బట్టలు కట్టుకోవటానికి ఈలోకంలోనికి రాలేదు, అంత:కరణశుద్ధిని సంపాదించుకోవటానికి వచ్చాము. వచ్చినపనిని మర్చిపోవద్దు. నీ అంత:కరణం ఎప్పుడైతే శుద్ధి అయ్యిందో అది దానిమూలంలో లయమవుతుంది, అప్పుడు నీకు సత్యం గోచరిస్తుంది, జీవితగమ్యం అదే. గుణాలు, ఆ గుణాలు ప్రేరేపించే విషయాల నుండి బయటకురావాలి నీవు గుణరహితుడవు అవ్వాలి. గుణాల నుండి బయటకు రావు అనుకో జననమరణచక్రంలో నుండి బయటకు రాలేవు. నీవు జ్ఞాననిష్టలో ఉండాలి, నీవు చేసేపని భగవదనుభవం పొందటానికి నీకు సహకరించాలి. నేను చనిపోతున్నాను అనుకొనేవాడు ప్రతీవాడు పుడతాడు, నేను పుట్టాను అనుకొనేవాడు ప్రతీవాడు చనిపోతాడు, ఇది కర్మచక్రం. నీకు అమృతానుభవం కలిగేవరకూ ఇలా కర్మచక్రంలో కొట్టుకొనిపోతూ ఉంటావు. నీ బుద్ధిలో కల్మషం పెట్టుకొని, నీ బుద్ధిలో కషాయంపెట్టుకొని, నీబుద్ధిని కలకలం చేసుకొని, కల్లోలం చేసుకొని అందులోనుండి విడుదలపొందకుండా అమృతానుభవం పొందాలి అనుకొంటున్నావు? బుద్ధిలో కల్మషం ఉంటే అదిదాని మూలంలో ఎలా లయం అవుతుంది? లయం కానేకాదు.

స్నేహం అంటే ఏమిటి? స్నేహితుడు అంటే మన దుఃఖాన్ని తగ్గించాలి, మన ఆనందాన్ని పెంచాలి, అంతేగాని మనలో ఉన్న అశాంతిని పెంచేవాడు, మన దుఃఖాన్ని పెంచేవాడు మన ఆనందాన్ని పోగొట్టేవాడు స్నేహితుడుకాదు, వాడు స్నేహితుడి రూపంలో ఉన్న పిశాచం. నీ చేతిలో ఉన్న పనిని జాగ్రత్తగా చేసుకొంటూవెళ్ళు. అది నెరవేరుతుందా, నెరవేరదా అని అనుకోవద్దు. ఏమీ అనుకోకుండా ఉండు, అప్పుడు మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. అనుకోవటాలే సంస్కారములుగా మారిపోతున్నాయి. చైతన్యం ఏమీ అనుకోదు, వారు ఉంటారు అంతే, నీవు ఏమీ అనుకోకు అప్పుడు ఆ ఉన్నవారిలో నీవు ఐక్యమయిపోతావు. నీవు చేసే ప్రతీపని యోగివి అవ్వటానికి చెయ్యి. సమానబుద్ధిని సంపాదించు, భగవంతుడు లోపల ఎంత సమానంగా ఉన్నాడో, ఎంత సహజంగా ఉన్నాడో నీ బుద్ధి కూడా అంత సమానంగా, అంత సహజంగా అయితే అందులో ఐక్యమయిపోతుంది, ఏదేహం అయితే శవం అవుతోందో అదే ఆత్మ అనుకొని, అదే సర్వస్వం అనుకొని, అదే సత్యం అనుకొని, అదే నువ్వు అనుకొని 100 సంవత్సరాలు దానికోసమే జీవిస్తున్నావు. జీవితం పొడుగునా



దానికోసమే ఆలోచిస్తున్నావు. అదా నిన్ను ఉద్ధరించేది? ఆ శరీరాన్ని ఉపయోగించుకొని దేనిని పొందాలో మర్చిపోయావు, అదే మాయ, ఎవరిమీద అయినా కోపం పెట్టుకొన్నా, ఇష్టాయిష్టాలు పెట్టుకొన్నా ఈశవం కోసమే పెట్టుకొంటున్నావు. శరీరం పెరుగుతుంది, అది ఏదో రోజు మరణిస్తుంది. శరీరం మరణించటంలో విశేషంలేదు, అది సహజం. అది నీవు అనుకోకుండా, ఏదైతే నీవో దానిని తెలుసుకోవటానికి ఈ శరీరాన్ని ఉపయోగించుకో. జీవితం పొడుగునా తపించేవారికి, జీవితం పొడుగునా ఇతరులకు సహాయసహకారములు అందించేవారికి, జీవితం పొడుగునా వారు కాలిపోతూ ఇతరులకు వెలుగునిచ్చే వారికే అమృతానుభవం పొందటం అనేది దూరంగా కనబడుతోంది. ఏదోకొద్ది రోజులు ట్రైనింగ్ పొంది అమృతానుభవం పొందాలి అని చూస్తున్నావా? అది ఎలా సాధ్యం? ఏదైతే నేనుఅని ఇప్పుడు నీవు అనుకొంటున్నావో అదికాలిపోకుండా నీకు అమృతానుభవం కలుగుతుందా? అది సాధ్యంకాదు.

ఏ వస్తువులో అయితే దుఃఖంలేదో, ఏ వస్తువులో అయితే వేరుభావన లేదో అది అనుభవంలోనికి వచ్చేవరకు నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. మీకు 100 కోట్లు డబ్బు ఉంది అనుకోండి, మీకు దుఃఖం వస్తోంది అనుకోండి. మీరు ఫెయిల్ అయిపోయినట్లులెక్క. ఆ డబ్బు దుఃఖం రాకుండా ఎందుకు ఆపుచేయలేకపోతోంది. సాధన అంటే మన ఇంద్రియాలు, మన మనస్సు చెప్పినట్లు మనం వినటం కాదు, మనం చెప్పినట్లు మన ఇంద్రియాలు, మన మనస్సు వినాలి, వాడు సాధకుడు. వాడికి ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా సిద్ధి కలుగుతుంది. నీవు మెచ్చిన భోజనం తినేటప్పుడు దానిని ఎంత ఇష్టంగా అనుభవిస్తున్నావో అంత ఇష్టంగా భగవంతుడి కళ్యాణగుణాలను నీవు అనుభవిస్తున్నావా? అలా అనుభవించటం లేదు అనుకో నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? ఈ దేహమే సత్యం, దేహమే ఆత్మ అనుకొన్నంతకాలం కోరికలను ఆపుచేయలేవు. వ్యక్తిభావన వస్తూనే ఉంటుంది. నీవు ఏదైనా మంచి చేసావు అనుకో, నీ సంకల్పం వలన చేయలేదు, భగవంతుడునీద్వారా అది చేయించాడు, నేను చేసాను అని నీవు అనుకోవద్దు, చేయటానికి నీవు అంటూ ఉన్నావా? నీవు లేవు అసలు, కాని నేను చేసాను అనుకొంటున్నావు, అదే కర్తృత్వం, దానిని బట్టే దుఃఖం వస్తోంది, ఉన్నది ఒక్కటే, అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు, నేను అంటూ లేను అన్న సంగతి నీకు తెలుస్తుంది.

భగవంతుడు మీకు ఆత్మజ్ఞానం ఇవ్వాలి అనుకొన్నాడు అనుకోండి, మన మీద ఆయనకు దయ కలిగింది అనుకోండి మన బుద్ధిలో ఉన్న కల్మషాన్ని కొన్ని క్షణాలలో తీసేసి, అది బయటకు పోతున్నప్పుడు, అది పోతున్నట్లు మీకు తెలిసేటట్లుగా చేసి, మీ సహస్రారాన్ని

శుద్ధిచేసి మిమ్మల్ని అమృతమయం చేస్తాడు. భగవంతుడికి అసాధ్యమంటూ ఏదీలేదు. విశ్వాసం ఉన్నవాడికి సొమ్ము, విశ్వాసంలేని వాడికి దుమ్ము. ఈశ్వరుడి మీద మీకు పరిపూర్ణమైన విశ్వాసం కుదిరితే, నోటితో భగవంతుడు ఉన్నాడని చెప్పటం కాదు ఆయన మీద, ఆయన చెప్పిన వాక్యం మీద మీకు ప్రమాణబుద్ధి కలిగితే బుద్ధిలో ఉన్న వంకరలు పోతాయి, లోపల తగినంత విశ్వాసం లేకుండా, ప్రేమలేకుండా బాహ్యంగా ఏవో సాధనలు చేసినా వాటివలన ప్రయోజనం లేదు, మనం ఆయనను పొందలేము. బాహ్యంగా మనం చేసే పనులవలన భగవంతుడు మోసపోడు, ఆయన మనకంటే తెలివిగలవాడు. ఆయన యొక్క జ్ఞానంతో పోల్చుకొంటే మన తెలివి ఎంత, మన జీవితం ఎంత? భగవంతుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం కలగాలి. లోపల అహంభావన పెట్టుకొని మనం పుణ్యకార్యాలు చేస్తూ ఉంటే దానివలన భోగం వస్తుంది, చిత్తశుద్ధి ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. చిత్తశుద్ధి ఉన్నవాడు కాలప్రవాహంలో నుండి, కర్మచక్రంలో నుండి, యముడి యొక్క పాశంలో నుండి విడుదలపొందుతాడు.

ఏదైతే నేను అనుకొంటున్నానో ఆ నేనును విడిచిపెట్టటం కష్టంగానే ఉంది, దానిని విడిచిపెట్టలేకపోతున్నాను అని ఒక భక్తుడు అంటున్నాడు. కుండలోపల అన్నం ఉంటుంది. కుండపైన మూత ఉంటుంది. మూత ఉండటం వలన లోపల అన్నం ఉన్నా అది మనకు కనబడదు. అలాగే ఈ నేను అనే తలంపు ఒక మూత. ఈమూత మన హృదయంలో ఉన్న ఆనందాన్ని, వైకుంఠాన్ని మనకు కనబడకుండా చేస్తోంది. ఆ మూతను తీసి ఒక ప్రక్కన పెడదాము అంటే అదే నేను అనుకోవటం వలన ఆ మూతను తీసి ప్రక్కనపెట్టలేకపోతున్నాము. అదిపోతే మనం పోతాము అనుకొంటున్నాము, కాని అదిపోతే మనం పోముసరికదా మనం ఎవరిమో మనకు తెలియబడుతుంది. చిక్కంతా, ముడి అంతా ఇక్కడే ఉంది. ఏదైతే ఉందో దానిమీద నీకు అనురక్తి ఉండాలి, మిగతాది అంతాడస్టు, మీ ఇంట్లో మనుషులు కూడా వారు మీ సొంతం అనుకోవద్దు. వారిని చూడమని భగవంతుడు మీకు వారిని కేటాయించాడు. వారు బతికి ఉండగా మనమైనా వెళ్ళిపోతాము, మనం బతికి ఉండగా వారు అయినా వెళ్ళిపోతారు, కళ్ళుమూస్తే ఒకరికి ఒకరికి ఏమీ సంబంధంలేదు. మన డ్యూటీలో మటుకు లోపం లేకుండా చేయాలి, వారిని ఉద్ధరించటానికి మనం ఎవరము. మన పని మనం చేయాలి, అంతా భగవంతుడే చూసుకొంటాడు. జరగేది ఏదో జరుగుతుంది, జరుగరానిది ఏదీ జరుగనే జరుగదు. ఈశ్వరుడికి మనం వేరుగా ఉన్నాము అని అనుకోవటం వలన మనకు వేదన వస్తోంది. ఈశ్వరుడి సంకల్పమే నా సంకల్పం అనుకొంటే, ఈశ్వరుడి మీద వేరుభావన లేకపోతే వాడు దుఃఖరహితస్థితిని పొందుతాడు.



భగవంతుడు పని చేసుకొంటూ వెళుతున్నాడు, ఈసృష్టిని అంతా నడిపేది ఆయనే ఆయనకు తెలియకుండా ఈసృష్టిలో ఏమీ జరగటంలేదు. నీవు కర్తృత్వం లేకుండా జీవిస్తూ ఉంటే దైనందిన జీవితంలో గర్వంలేకుండా, అతితెలివిని తగ్గించుకొని జీవిస్తూ ఉంటే నీ బాధ్యతను ఆయన స్వీకరిస్తాడు, నీ యోగక్షేమాలను ఆయన చూస్తాడు, నీ గుణాల నుండి విడుదల పొందటమేకాదు, నీ యోగక్షేమముల గురించి నీవు ఆలోచించుకోవటం మానివెయ్యి, నీ గురించి నీవు ఆలోచించుకోవటం మానివెయ్యి. అలాగ అయితే ఎలాగ, నా మాట ఏమిటి అని అంటావేమో నేను ఉన్నాను కదా, అంతా నేను చూసుకొంటాను అని భగవంతుడు చెపుతున్నాడు. నేను ఏదో సాధించాను అని నీవు అనుకొంటున్నావు కాని అది కూడా నేను సాధించి పెట్టినదే. నీ బుద్ధిలో ఉన్న వంకరలు పోయినాయి అనుకో అది అంతా ఈశ్వరుని కృప వలననే జరిగింది అని నీకు తెలియటంలేదు. ఉన్నది ఆయనే, అంతా ఈశ్వరుడే, నీవు ఎవరు? అతితెలివిని ఆపుచెయ్యి. నా మాట ఏమిటి అని నీవు మనస్సులో అనుకోవచ్చు. ఈ లోకాన్ని అంతా చూసేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనే నిన్ను కూడా చూస్తాడు, అనుకొనేది జీవుడి సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఈ సృష్టినంతా మోసే భగవంతుడు నీ ఒక్కడి బరువు మోయలేడా? నువ్వు ఒక్కడివి ఆయనకు బరువు అయిపోతావా? అయితే నీ భారాన్ని ఆయన మీద వేయలేకపోతున్నావు. నీ భారాన్ని ఆయన మీద వెయ్యటం నేర్చుకొంటే ఆయనే మోస్తాడు. అప్పుడు నీవు 100 సంవత్సరాలు బతికినా 100 క్షణాలుగా నీజీవితం వెళ్ళిపోతుంది. ఈమీటింగు ఎప్పుడు అయిపోతుంది, ఎప్పుడు అయిపోతుంది అని అలాకాకుండా మీకు ఇష్టమైన భోజనం తినేటప్పుడు ఎలా అనుభవిస్తున్నారో అలాగ నా మాటలను ఎంజాయ్ చేయండి. అలా ఎంజాయ్ చేస్తూఉంటే మీకు దొరక్కుండా ఎక్కడకుపోతాను అంటున్నాడు భగవంతుడు, కాని మనం ఆముదం నోటిలో పోసుకున్నట్లు అనుభవిస్తున్నాము ఇంక ఆయన ఎలా దొరుకుతాడు.

ఏ శరీరం అయితే శవం అవుతోందో దానితో తాదాప్యం తగ్గించుకోండి. ఈశరీరం మరణించినా మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది, దానితో తాదాప్యం పెంచుకోవటానికి ప్రయత్నం చేయండి. మీరు ఇటుకాదు జరగవలసింది, అటు జరగండి, అటు ప్రయాణం చేయండి, అప్పుడు మరణాన్ని జయిస్తారు, కర్మచక్రంలో నుండి విడుదల పొందుతారు, మీకు మోక్ష సుఖం లభిస్తుంది. ప్రేమపూరితజీవితం ఉన్నవాడిని, జ్ఞానపూరిత జీవితం ఉన్నవాడిని అమృతస్థితి వచ్చి వరిస్తుంది. మీ జీవితాన్ని అలా మల్చుకొంటే అమృతానుభవం దగ్గరకు మీరు వెళ్ళటంకాదు, అదేవచ్చి మీశిరస్సుమీద పడుతుంది. అందుచేత మీ జీవితాన్ని ప్రేమపూరితం, జ్ఞానపూరితం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 24-04-04 | శని | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం శంకరజయంతి సందర్భంగా |
| 03-05-04 | బుధ | పెదఅమిరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో |



ది. 14-4-2004 బుధవారం ఉదయం గం॥ 9-30 ని॥లకు

తణుకు, పాలిటెక్నిక్ కాలేజి ఎదురుగా

విన్నకోటవారి వీధిలో

డా॥ **వి.టి. శ్రీనివాస రెడ్డి**

డా॥ **వి. భువనశ్రీ**

లచే నిర్మించబడిన **గీతా హాస్పటల్స్‌ను**

ప్రారంభిస్తున్న

సద్గురు శ్రీ నాన్నగారు

20-4-2004



## కథావశేషులు ఉద్దరాజు ఆనందరాజు గారి 24వ వర్ధంతి సభ

భీమవరం ఏప్రియల్ 13, సభావేదిక : శ్రీ రామకృష్ణ సభాభవనము (డి.యన్.ఆర్.కళాశాల ఆడిటోరియం)

ఆధ్యాత్మిక సంఘం వారు గత 23 సంవత్సరాలుగా **ఉద్దరాజు ఆనందరాజు** గారి వర్ధంతి నిర్వహిస్తూ ఒక ఆధ్యాత్మిక సభ జరిపించి చక్కని సందేశం ద్వారా ఆనందరాజు గారిని జ్ఞాపకంచేస్తూ వస్తున్న సభ. పట్టణ ప్రముఖులు చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు **శ్రీ కనుమూరి సృతనారాయణరాజు** అధ్యక్షతవహిస్తూ **ఆనందరాజు** గారు **ఉత్తమగృహస్తునిగా** వ్యాపారంలో ధర్మాన్ని కాపాడిన వాణిజ్యవేత్తగా-రైతుగా కష్టపడి ఉన్నతంగా ఎదిగినా నిరాడంబరమైన వ్యక్తిత్వంతో ఆదర్శప్రాయంగా జీవించిన మహనీయునిగా అభివర్ణిస్తు నివాళి సమర్పించారు. ప్రొఫెసర్ శ్రీ **కలిదిండి వెంకట్రామరాజు** గారు **ఆనందరాజుగారి** విశిష్టతను పద్యాలలో వినిపించి సభకు రక్తికట్టించారు. శ్రీమతి **నంబూరి భాస్కరకుమారి** ప్రార్ధనతో ఈ సభ ప్రారంభమైనది. ముఖ్య అతిథిగా విచ్చేసిన **జిన్నూరు సద్గురు శ్రీ నాన్నగారు** రమణ సత్యాన్ని సందేశాత్మకంగా ఎన్నో నిత్య జీవన సత్యాలను సమన్వయంచేస్తూ భగవాన్ రమణ మహర్షి వేదాంతాన్ని సులభంగా చిన్న చిన్న మాటలతో అప్యాయంగా బోధించి భక్తుల హృదయాలను జ్ఞానామృతధారలతో కదిలించారు. **శ్రీ ఉద్దరాజు పద్మనాభరాజు శ్రీనాన్నగారిని, శ్రీ సత్యనారాయణ రాజుగారిని, శ్రీ వెంకట రామరాజు గారిని, శ్రీమతి భాస్కర కుమారి** గారిని శాలువాలతో సత్కరించారు. శ్రీ **చెరుకువాడ వెంకటరామయ్య** స్వాగతాన్నందించారు.

రమణ భాస్కర